క్లుప్తంగా

బాధిత కుటుంబానికి సాయం



చెక్కు అందించిన సొసైటీ పాలకవర్గం

సారంగపూర్: మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన పాత ఐర దేవారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం బాధిత కుటుంబానికి స్థానిక మ్యాక్స్ సొసైటీ పాలకవర్గ సభ్యులు రూ.లక్షను ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో మ్యాక్స్ సొసైటీ అధ్యక్షుడు నక్కిరెడ్డి నర్సారెడ్డి, ఉపాధ్యక్షుడు అయిర భోజారెడ్డి, కార్యదర్శి భూమారెడ్డి, కోశాధికారి లక్ష్మారెడ్డి, డైరెక్టర్లు పోతారెడ్డి, రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

అందుబాటులో సబ్సిడీ వరి విత్తనాలు

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని రైతువేదికలో ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం పథకం కింద సబ్సిడీపై దొడ్డు, సన్నరకం వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాంచందర్ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యంటీయూ–1010 దొడ్డు రకం వరి విత్తనాల 25 కేజీల బస్తా ధర రూ.995, ఇందులో సబ్సిడీ రూ.250 ఉండగా రైతు ధర రూ.745. ఆర్‌ఎన్‌ఆర్–15048 సన్న రకం వరి విత్తనాల 25 కేజీల బస్తా రూ.1165, సబ్సిడీ రూ.500, రైతు ధర రూ.665గా ఉన్నట్లు పేర్కొన్నారు. కావాల్సిన రైతులు ఆధార్, పట్టాదారు జిరాక్స్‌లతో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

‘చింతల్‌పేట్‌ను పంచాయతీగా మార్చాలి’



ఎంపీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధిలో ఉన్న చింతల్‌పేట్ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు శనివారం గ్రామానికి వచ్చిన ఎంపీవో రత్నాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు నవీన్, హరి, నర్సయ్య, రవి, రాజు, నాగేష్, మధు, శేఖర్, భూమశంకర్, ప్రవీన్ తదితరులు ఉన్నారు.

వివాహిత అదృశ్యం



మల్లేశ్వరి (ఫైల్)

నర్సాపూర్(జి): మండలంలోని కుస్లి గ్రామానికి చెందిన గన్నారం మల్లేశ్వరి (30) అనే వివాహిత అదృశ్యం కాగా.. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో శనివారం ఆమె తల్లి అంజనాబాయి నర్సాపూర్ (జి)పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మల్లన్న పల్లకి ఊరేగింపు



పల్లకి వద్ద గ్రామస్తులు

లక్ష్మణచాంద: నిర్మల్‌రూరల్ మండలంలోని ముజ్గి గ్రామ మల్లన్నస్వామి పల్లకి శనివారం లక్ష్మణచాంద మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామానికి చేరింది. ఉదయం గ్రామంలోని వీధుల గుండా మల్లన్నస్వామి పల్లకి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు మంగళహారతులతో వచ్చి స్వామి వారికి స్వాగతం పలికి పూజలు చేశారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం రాతి ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించా రు. ఈసందర్భంగా లక్ష్మణచాంద మున్నూరుకాపు సంఘ ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యజ్ఞం చేయగా.. కార్యక్రమం తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు.

క్రీడలకు చేయూత ఏది?

క్రీడలతో స్నేహభావం పెంపొందడంతోపాటు శారీరక, మానసికంగా ఆరోగ్యవంతులుగా మారుతారని.. ప్రతి ఒక్కరూ ఆటల పోటీలను తమ జీవితంలో భాగం చేసుకోవాలని వివిధ కార్యక్రమాల్లో పాలకులు, అధికారులు, అతిథులు తరచుగా చెబుతుంటారు. కానీ క్షేత్రస్థాయిలో సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రతిభ ఉన్నా.. పేదకుటుంబాలకు చెందిన క్రీడాకారులు వెలుగులోకి రావడం లేదు. క్రీడాకారులున్న చోట మైదానాలు లేకపోవడం, మరికొన్నిచోట్ల కోచ్‌లు లేకపోవడం వంటి సమస్యలు నెలకొన్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

- అలంకారప్రాయంగా మినీ స్టేడియాలు
- కోచ్‌లు, క్రీడాసామగ్రి లేక నిరుపయోగం
- ఏళ్లు గడుస్తున్నా.. అందుబాటులోకి రాని వైనం
- పాలకులు దృష్టి సారించాలంటున్న క్రీడాకారులు



భైంసాలోని మినీ స్టేడియం

భైంసాటౌన్: జిల్లాలో ప్రతిభ కలిగిన క్రీడాకారులున్నా.. వారికి పూర్తిస్థాయిలో ప్రోత్సాహం లభించడం లేదు. నియోజకవర్గానికి ఓ మినీ స్టేడియం నిర్మించినా.. అవి అందుబాటులోకి రాకపోవడంతో క్రీడల నిర్వహణకు నోచుకోవడం లేదు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన క్రీడా మైదానాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పగలిన గోడలు, పిచ్చిమొక్కలతో మైదానాలు దర్శనమిస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా కోచ్‌ల నియామకం లేక, క్రీడా సామగ్రి నిరుపయోగంగా మారింది. పాలకులు పట్టించుకోకపోవడంతో పేదకుటుంబాల క్రీడాకారులు ఆటలకు దూరం అవుతున్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్నవారు ప్రైవేట్ మైదానాలు, స్టేడియాలను ఆశ్రయిస్తున్నారు.

రూ.కోట్లు వెచ్చించినా...

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతిభ కల్గిన క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు గత ప్రభుత్వం సుమారు నాలుగేళ్ల కిందట నియోజకవర్గానికో మినీ స్టేడియం మంజూరు చేసింది. ముధోల్ నియోజకవర్గానికి సంబంధించి భైంసా పట్టణంలో మహాగాం రోడ్డులో రూ.2.65 కోట్లతో మినీ స్టేడియం నిర్మించారు. ఖానాపూర్‌కు సంబంధించి తర్లపాడ్ మార్గంలోనూ రూ.2.65 కోట్లు వెచ్చించి స్టేడియం ఏర్పాటు చేశారు. నిర్మల్ లోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో రూ.1.20కోట్లతో గ్యాలరీ, ప్రహరీ నిర్మించారు. కా గా నిర్మల్‌లో నడిబొడ్డున క్రీడాకారులకు అందుబా టులో ఉండడంతో క్రీడల నిర్వహణకు అనువుగా ఉంది. కానీ భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో పట్టణ కేంద్రాలకు దాదాపు 2 నుంచి 3 కి.మీల దూ రంలో ఉండటంతో క్రీడాకారులు ఆసక్తి చూపడం లే దు.

స్టేడియాల్లో సౌకర్యాలేవి..

భైంసా, ఖానాపూర్ మినీ స్టేడియాల నిర్మాణం పూర్తయి ఏళ్లవుతోంది. అయినప్పటికీ క్రీడాకారులకు తర్ఫీదునిచ్చేందుకు కోచ్‌లను నియమించలేదు. క్రీడాసామగ్రి సైతం అందుబాటులో లేదు. మినీ స్టేడియాల్లో కనీసం క్రీడాపోటీలు నిర్వహించడం లేదు. దీంతో ఆయా పట్టణాల్లో మినీ స్టేడియాలున్న విషయం చాలా మంది క్రీడాకారులకు తెలియదంటే అతిశయోక్తి కాదు. ప్రతి స్టేడియంలో నలుగురు కోచ్‌లతోపాటు క్రీడా సామగ్రి అందుబాటులో ఉంటే ఆటలాడేందుకు క్రీడాకారులు ఆసక్తి చూపుతారు. వాకింగ్ చేసేవారు సైతం మైదానాలను వినియోగించుకుంటారు.

పాలకులు దృష్టి సారిస్తే..

భైంసా, ఖానాపూర్‌లో ఉన్న మినీస్టేడియాలను క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చేలా ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారుతున్న నేపథ్యంలో కోచ్‌లను నియమించి సామగ్రి తీసుకురావాలి. మినీస్టేడియాలను అందుబాటులోకి తెచ్చేలా కృషి చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు విన్నవించాం

భైంసా, ఖానాపూర్‌లో మినీ స్టేడియాల నిర్మాణాలు పూర్తయ్యాయి. కానీ, కోచ్‌లను నియమించకపోవడంతో క్రీడాకారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో కోచ్‌లను నియమించాలని ప్రభుత్వానికి నివేదిక అందించాం. కోచ్‌లను నియమించేందుకు ప్రభుత్వం సైతం సిద్ధంగా ఉంది. కోచ్‌లను నియమించిన తర్వాత క్రీడాసామగ్రి అందుబాటులో ఉంచుతాం.

– శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి, నిర్మల్

కోచ్‌లను నియమించాలి

మినీ స్టేడియాలకు కోచ్‌లను నియమించాలి. క్రీడా సామగ్రి అందుబాటులో ఉంచి.. ఆసక్తి కల్గిన క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో స్థానిక క్రీడాకారులు రాణిస్తారు. ప్రభుత్వం, అధికారులు ఆ దిశగా దృష్టి సారించాలి.

– సంతోష్, ఫుట్‌బాల్ క్రీడాకారుడు, భైంసా



విరిగిపోవడంతో పక్కన పడేసిన గేటు



ఎగిరిపోయిన పైకప్పు రేకులు

పంచాయతీ కార్మికుల నిరసన



తానూరు: ర్యాలీ తీస్తున్న పంచాయతీ కార్మికులు

బాసర: తమ సమస్యలు పరిష్కరించాలని బాసర పంచాయతీ కార్మికులు.. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమకు ప్రతి నెలా రూ.18వేల వేతనం, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీవో గంగాసింగ్‌కు వినతిపత్రం అందించారు. కార్మికుల సంఘం అధ్యక్షుడు నగేశ్, కార్మికులు పాల్గొన్నారు.

తానూరు: రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సమ్మె ప్రారంభించినట్లు కార్మికులు తెలిపారు. అనంతరం ర్యాలీ తీసి డీఆర్డీవో విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పెండింగ్ వేతనాలతోపాటు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో పంచాయతీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయంలో సమ్మె నోటీస్ అందజేశారు. ప్రభుత్వం స్పందించి గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీ నాయకత్వంతో చర్చలు జరపకుంటే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్మిక సంఘాల నాయకులు కొరిటికంటి శేఖర్, కట్కూరి నాగరాజు, సుద్దాల వెంకటేష్, రాజన్న, నర్సయ్య, రాజవ్వ ఉన్నారు.

ముధోల్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శివకుమార్‌కు మండలంలోని పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు



అనంతపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రామారావు

- డీఈవో రామారావు

నిర్మల్‌రూరల్: సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెలో ఉన్నందున.. విద్యార్థుల చదువులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని డీఈవో రామారావు అన్నారు. శనివారం డీఈవో మండలంలోని అనంతపేట కేజీబీవీని సందర్శించారు. ఈ సందర్భంగా తాత్కాలిక సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులు ప్రణాళికతో వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. సకాలంలో పాఠాలు బోధిస్తామని.. ఇబ్బందులుంటే ఉపాధ్యాయులకు చెప్పాలని పేర్కొన్నారు. తాత్కాలిక ప్రత్యేక అధికారి దేవిప్రియ, సిబ్బంది ఉన్నారు.

చదువుపై దృష్టి సారించాలి



భైంసాలో మాట్లాడుతున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి

భైంసాటౌన్: విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా చదువుపై దృష్టి సారించాలని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో విద్యార్థినులకు బోధనపరంగా ఇబ్బందులు లేకుండా చూడాలని ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి, ఎంఈవో సుభాష్‌ను ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ.. పరీక్షలు సమీపిస్తున్నందున శ్రద్ధగా చదువుకుంటూ సమయానికి భోజనం చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడొద్దు

- ప్రజావేదికలో డీఆర్డీవో విజయలక్ష్మి
- రూ.12,627 రికవరీకి ఆదేశాలు



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

తానూరు: ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులకు జాబ్‌కార్డులు అందిస్తామని పేర్కొన్నారు. శనివారం మండల ప్రజాపరి షత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించగా డీఆర్డీవో మాట్లాడారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ పనులకు రూ. 7,45,25,532 ఖర్చు చేసినట్లు వివరించారు. ఉపాధి పనుల్లో తానూరు మండలవ్యాప్తంగా రూ.12,627 నిధులు దుర్వినియోగం అయినట్లు విచారణలో తేలిందని డీఆర్డీవో పేర్కొన్నారు. వెంటనే సంబంధిత సిబ్బంది నుంచి రికవరీ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతకు ముందు సామాజిక తనిఖీ బృందాల సభ్యులు గ్రామాల వారీగా నివేదికలను చదివి వినిపించారు.

రైతులకు అవగాహన కల్పించాలి..

జాబ్‌కార్డు కల్గిన రైతులు పశువుల పాకలు, హార్టికల్చర్ ద్వారా పండ్ల మొక్కల పెంపకం, ఫారంపాండ్స్ నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

స్థానికసంస్థల ఎన్నికల్లో గెలిపించాలి

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

లోకేశ్వరం: బీజేపీ సిద్ధాంతాలకు కార్యకర్తలు కట్టుబడి ఉండి.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో పోలింగ్ బూత్ కమిటీలకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి పని చేయాలని సూచించారు. అనంతరం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణానికి సంతాపంగా మౌనం పాటించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, క్రైరి మహేశ్‌గౌడ్, చిన్నారావు, మహేందర్‌రెడ్డి, శ్రీధర్, రాజేశ్‌బాబు, నర్సారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మంద గణేశ్, సాయన్న, ముత్తవ్వలు ఉన్నారు.

బూత్ కమిటీల ఎన్నిక

కుంటాల: గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేసేందుకు బూత్ కమిటీలను ఎన్నుకుంటున్నట్లు బీజేపీ మండల కన్వీనర్ గుద్దేటి నర్సయ్య, సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేశెట్టి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కల్లూరులో బూత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకున్నారు. 85, 86వ బూత్‌ల అధ్యక్షులుగా ముధోళ్ల లక్ష్మణ్, సోనేకర్ శ్రీనివాస్, సెక్రెటరీలుగా పిట్లం రాజ్‌కుమార్, కాషారం సురేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వీరిని సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌పటేల్, మాజీ వైస్ ఎంపీపీ మౌనిక నవీన్, మండల ప్రధాన కార్యదర్శి సాయి సూర్యవంశీ, నాయకులు నారాయణ, దత్తుపటేల్, రాములు, దత్తు, విలాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

108ను సద్వినియోగం చేసుకోవాలి

కడెం: మండలానికి నూతనంగా కేటాయించిన 108 అంబులెన్స్‌ను రోడ్డు ప్రమాదాలు, డెలివరీ తదితర అత్యవసర సమయాల్లో సద్వినియోగం చేసుకోవాలని సిబ్బంది పేర్కొన్నారు. శనివారం మండలంలోని పాండ్వపూర్ గ్రామంలో 108 అంబులెన్స్ సేవలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పైలట్ వసంత్‌రావు, ఈఎంటీ సేవ, ఉన్నారు.

కార్మికుల వంటావార్పు

ఖానాపూర్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె 8వ రోజుకు చేరింది. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు సమ్మెలో పాల్గొన్న కార్మికులు శనివారం రోడ్డుపైనే వంటావార్పు చేసి వినూత్న నిరసన తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో లక్ష్మి, విజయ, పద్మ, భాను, నర్సవ్వ, నారాయణ, మంజుల, మంగవ్వ తదితరులు ఉన్నారు.

‘కార్యాలయంలో సంప్రదించాలి’

ముధోల్: ఇందిరమ్మ ఇళ్ల కోసం డేటా ఎంట్రీ చేసుకోనివారు కార్యాలయంలో సంప్రదించి డేటా ఎంట్రీ చేయించుకోవాలని ఎంపీడీవో శివకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి అధికారులు డేటా ఎంట్రీ చేసుకున్నారని.. తప్పినవారు ప్రజాపాలన రసీదు, ఆధార్ జిరాక్స్‌తో ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కబడ్డీలో సత్తా చాటిన మనోరంజన

బాసర: మండలంలోని కిర్గుల్ (బి) ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని ముత్యాల మనో రంజన కబడ్డీలో సత్తా చాటింది. శుక్రవారం సిద్దిపేట జిల్లా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 34 పాయింట్లతో గెలిచి నిర్మల్ జట్టు సెమీస్ చేరుకుంది. ఈ మ్యాచ్‌లో ప్రతిభ కనబర్చిన మనోరంజనను హెచ్‌ఎం నర్సారెడ్డి, విద్యార్థులు అభినందించారు.

సన్మానం

భైంసాటౌన్: బంగారు, వెండి వర్తకసంఘం భైంసా పట్టణ కార్యవర్గాన్ని శనివారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త విలాస్ గాదేవార్ సన్మానించారు. అధ్యక్షుడు మైస గోపాల్, ప్రధాన కార్యదర్శి కోర్వ శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులను తన కార్యాలయంలో శాలువాతో సత్కరించారు. కోశాధికారి సుధాకర్‌పటేల్, ఉపాధ్యక్షులు సాదుల నరేందర్, సంతోష్, ప్రకాశ్, లక్ష్మీకాంత్, గోపి ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

ఖానాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని దిలావర్‌పూర్, కొత్తపేట్, బాదనకుర్తి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

‘ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం’

ఖానాపూర్: ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టాన్ని అమలు చేసేందుకు గ్రామస్థాయి నుంచి రికార్డుల నిర్వహణ పటిష్ఠంగా ఉంచేందుకు పూర్వ వీఆర్‌వోలను తీసుకోవాలనే ప్రభుత్వ నిర్ణయం హర్షనీయమని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల శివకుమార్ అన్నారు. శనివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దీంతో రాష్ట్రంలో 5,300 మందికి లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.

పరామర్శ

ముధోల్: మండలంలోని మచ్కల్‌లో గోవింద్‌పటేల్ తల్లి, సాయినాథ్‌పటేల్ తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం బాధిత కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నారాయణ్‌రావుపాటిల్ పరామర్శించారు.

కుంటాల: మండలంలోని విఠాపూర్ గ్రామంలో ఇంద్రసేనారెడ్డి రోడ్డు ప్రమాదంలో కదం రాజేశ్వర్‌రావు అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం బాధిత కుటుంబాలను మాజీ ఎంపీపీ ఆప్క గజ్జారాం పరామర్శించారు. కొండన్నగారి రమణారావు, సాయన్న, భూమన్న తదితరులు ఉన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి



సిబ్బందితో సమావేశమైన సీఐ నవీన్‌కుమార్

సోన్: పెండింగ్ కేసులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఖానాపూర్ సీఐ నవీన్‌కుమార్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సోన్ సీఐ నవీన్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించి పలు కేసుల వివరాలు తెలుసుకున్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. స్టేషన్ వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై షేక్ అహ్మద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్యపరీక్షలు

ఖానాపూర్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చూడాలని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి పిల్లల వైద్యుడు డా.సాయికృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన శ్రీరాంనగర్, సాయినగర్, భర్కత్‌పుర, ఇంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీలత, టీచర్లు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

పెంబి: మండలంలోని రాంనగర్ గ్రామంలో చిరుత యూత్ ఆధ్వర్యంలో రాంనగర్ కబడ్డీ ప్రీమియం లీగ్ పోటీలను శనివారం మాజీ ఎంపీటీసీ రామారావు, పంచాయతీ కార్యదర్శి కామ్రాన్ ప్రారంభించారు. ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కారోబర్ సిద్ధునాయక్, చిరుత యూత్ సభ్యులు కైలాస్, రవి, నరేందర్, రోహిదాస్, ఉపేందర్, రాజేశ్, నవీన్ తదితరులు ఉన్నారు.

డాక్టరేట్ అందుకున్న ఎన్‌ఆర్‌ఐ



డాక్టరేట్ అందుకుంటున్న జనార్దన్

ఖానాపూర్: 20 ఏళ్లుగా దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్న నిర్మల్ శాంతినికేతన్ దివ్యాంగుల కేంద్రం వ్యవస్థాపకుడు, ఖానాపూర్‌కు చెందిన పన్నెల జనార్దన్ డాక్టరేట్ అందుకున్నారు. జనార్దన్ చేసిన సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ ఆసియా ఇంటర్ నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ, ఇంటర్‌నేషనల్ అక్రిడిటేషన్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా శనివారం తమిళనాడు రాష్ట్రంలోని హొజూర్ సిటీలోని హిల్స్‌హోటల్ ఆడిటోరియంలో డాక్టరేట్ అందించారు.

దాతల సేవలు మరువలేనివి



మరమ్మతు చేసిన గదులను ప్రారంభిస్తున్న దాతలు

కుభీర్: మండలకేంద్రంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో గదుల మరమ్మతుల కోసం రూ.ఏడు లక్షలను విరాళంగా అందించిన హైదరాబాద్‌కు చెందిన ప్రమోద్–నీలిమా దంపతులను శిశుమందిర్ ప్రభంధకారిణి ఘనంగా సన్మానించారు. శనివారం మరమ్మతులు చేసిన గదులను ప్రారంభించారు. శిశుమందిరాల అభివృద్ధికి దాతలు సహకారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో విద్యాపీఠం సంఘటనా కార్యదర్శి పథకమూరి శ్రీనివాస్, పాఠశాల అధ్యక్షుడు పి.లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయులు హిర్ల హన్మాండు, ఉపాధ్యాయులు, పోషకులు తదితరులు పాల్గొన్నారు.

విరాళంపై డీఎల్‌పీవో విచారణ

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామపంచాయతీకి గతంలో మా అమ్మనాన్న ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు విరాళంగా అందించిన నిధులపై శనివారం డీఎల్‌పీవో సుదర్శన్ విచారణ చేపట్టారు. ధర్మోర గ్రామంలో 2019 సెప్టెంబర్ 19న బస్‌షెల్టర్ నిర్మించేందుకు వీడీసీ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. బస్‌షెల్టర్ నిర్మాణానికి రూ.35వేలు విరాళం అందించేందుకు ఆంజనేయులు ముందుకొచ్చారు. అనంతరం సదరు విరాళాన్ని పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. తర్వాత సదరు నిధులు కాజేశారని ప్రజాఫిర్యాదుల విభాగంలో ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు ఫిర్యాదు చేయగా శనివారం గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టారు. రూ.35 వేలను ట్రెజరీలో జమ చేశారని.. ఎలాంటి దుర్వినియోగం జరుగలేదని డీఎల్‌పీవో సుదర్శన్ వెల్లడించారు. విచారణలో ఈవోపీఆర్డీ సోలమాన్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సన్మార్గంలో పయనిస్తేనే భగవంతుడి అనుగ్రహం

నిర్మల్‌టౌన్: సన్మార్గంలో పయనిస్తేనే భగవంతుడి అనుగ్రహం కలుగుతుందని టీటీడీ ప్రవచకులు టీ.కే రామకన్నన్ అన్నారు. ధనుర్మాసం సందర్భంగా శనివారం జిల్లాకేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవరకోట దేవస్థానంలో తిరుప్పావై ప్రవచనాలు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని దివ్యప్రబంధ ప్రాజెక్ట్ సౌజన్యంతో టీటీడీ ప్రవచకులు టీ.కే రామకన్నన్ నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకుడు నవీన్, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.